అతి తెలివి

తారకరావుకి సంబంధ మొచ్చింది. మేనమామ రామారావు పెద్దరికం తీసుకున్నాడు. రామారావు అదో తరహామనిషి. నక్కజిత్తుల్లో పై చే యతనిది. ఎలాగైనా మేనల్లుడికి లాభసాటిగా వుండేట్లు ప్రయత్నం చెయ్యాలనుకున్నాడు రామారావు. అందు కతని విపరీతమైన ఆలోచనలు సహాయపడ్డాయి.

"ఒరేయ్, తారకం......" నెమ్మదిగా పిల్చాడు రామారావు.

"ఏం మావయ్యా!" దగ్గరగావచ్చి కూర్చున్నాడు తారకరావు.

"టైం ఎంతయిందిరా!"

"తొమ్మిదయింది మావయ్యా! ఏం!" అన్నాడు తారకరావు చేతివాచీ చూసి చెప్తూ.

"ఏమీలేదుగానీ, నువ్వీవాచీని అమ్మేయ్యాల్రా"

"అదేవిటి మావయ్యా; కొని మూడు మాసాలయినా లేదుగా... బాగానే నడుస్తూంది! అప్పుడే అమ్మెయ్య మంటున్నావేం!" ఆశ్చర్యపోతూ అన్నాడు తారకరావు; అతని కేం తెలుసు మేనమామమనసులోని వ్యూహం!

"అదంతా నీ కెందుకురా—ఎవరైనా కొనుక్కునేవాళ్లున్నారా చెప్పూ!"

"లేకేం మావయ్యా! ఇప్పుడు కావాలంటే రొఖ్ఖం వడేసి మరీ తీసుకుంటారు ఈ షేపు వాచీలు దొరకటమే కష్టంట"

"అవుతే మరేం...కల్సివచ్చిం దన్నమాట! వీలై నంత త్వరగా అమ్మేయరా. నష్టంరాకుండా చూడేం!" అన్నాడు రామారావు పొడుం కాస్త పీలుస్తూ. ఆ ఘాటు కాస్త తారకరావుకిసోకి తుమ్ముతుమ్మాడు.

"వెధవతుమ్ము, యిప్పుడే రావాలా!" విసుక్కున్నాడు రామారావు తన ప్రయత్నానికి అంతరాయం కలుగుతుందేమోనని. తారకరావుకి నవ్వు ఆగిందికాదు.

"మరి నేనంచేసేది మావయ్యా, మీా పొడుం మజా అది...ఇంతకీ వాచీ యెందుకమ్మేయాలో చెప్పావుకాదు మావయ్యా"

"నీకు చెప్పాలేమిట్రా అన్నీను!" అన్నాడు రామారావు కాస్త అధికారం కనబరుస్తూ.

"అదికాదు మావయ్యా! యీా వాచీమీాద నాకింకా మోజు తగ్గలేదు. దీనిషేపు యెంతో బావుంది—దీన్ని అమ్మేయాలంటే కష్టంగానేవుంది" అన్నాడు తారకరావు మెల్లగా. రామారావు చిన్నగా నవ్వుతూ—

"పిచ్చివాడా! యింకా చిన్నతనంకదూ, నీకు తెలీదులే ...యిలాంటివి తెలీడానికి యెంత అనుభవం వుండాలి!" అన్నాడు రామారావు. అంతేగానీ విడమర్చి చెప్పలేదు. ఒక్కసారే చెప్పేస్తే అందులో గొప్పతనం వుండదని గామోసు అతని అభిప్రాయం. తారకరావు కిదేం అర్ధంకాలేదు.

"ఏమిటో నాకర్ధంకాలేదు మావయ్యా" అన్నాడు తారకరావు.

"నీకు పెళ్ళిసంబంధం వచ్చిందికదటా్రా..." అన్నాడు రామారావు మేనల్లుడి మొహంలోకిచూస్తూ.

"అవుతే..."

"వాళ్ళే మరోపాటి కొనిస్తారు" అన్నాడు రామారావు గర్వంగా తన ప్రజ్ఞకి తనే మెచ్చుకుంటూ.

"నాకెలాగూ వాచీవుందికదూ! మరి వాళ్ళు కొనివ్వటమెందుకు మావయ్యా!" అమాయకంగా అన్నాడు తారకరావు. రామారావు సీరియస్‌గా మొహంపెట్టాడు.

"చూడు తారకం...నీపాటి తెలివి తేటలు, అనుభవం, నాకు లేవనుకోక ఎందుకుచెప్పానో ఆలోచించు; వచ్చే మార్గంవుంటే యెందుకు రాబట్టుకోకూడదూ అంటా. వాళ్లెలానూ వాచీ యివ్వాలి. మనం వద్దనేస్తే మానేస్తారు, తప్పదు. మనం ఎందుకు వద్దనాలి? ఈ వాచీని అమ్మేశావనుకో, ఆ డబ్బు మన కింకో ఖర్చుకి పనికొస్తుంది"

"మనం అడిగితే యిస్తారంటావా, మావయ్యా?"

"ఎవరికోసం! వాళ్ళని పుట్టించిన బ్రహ్మదేవుడు సహితం యిచ్చితీరాలి. అంతేననుకొన్నావటా్రా! చూస్తూండు యెన్ని రాబట్టుకుంటానో! ఈ కాలం కుర్రాళ్ళకి పెళ్ళి సమయమే మంచి అవకాశం. ఏవిటేమిటి కావాలో అన్నీ అప్పుడే గుంజుకోవాలి, అంటే, అత్తారినుండి రాబట్టుకోవాలి. యిప్పుడలా వుంది కాలం..." అన్నాడు రామారావు నవ్వుతూ. తారకరావుని మామయ్యమాటలు ఆకర్షించాయి. ఓవేపు ఆశపుట్టింది, నిజమే! మావయ్యన్నట్టు వచ్చే అవకాశముంటే యెందుకు మానేయాలి? తనకిమాత్రం తెలీదూ...

పరమేశంగారి అల్లుడు తారకొనుక్కొందుకు డబ్బిచ్చేవరకూ పందిట్లోకి కదల్లేదు.-పరమేశం ఖచ్చితంగా యిచ్చాడా మరి...? మావయ్యన్నట్టు కాలంఅలాంటిది. తనెందుకూరుకోవాలి...? ఈ ఆలోచనానంతరం తారకరావు మెదడు చురుకుగా పని చేసింది.

“ఐతే మావయ్యా, నువ్వన్నది బావుంది... వాళ్ళింకేవిటి ఇస్తారంటావూ?”

“కోరి ఎవరైనా యిస్తారుటా?... ఎంత తగ్గితే అంత మంచిదని చూస్తారు. మనం అడగాలిగాని... నీకేవిటికావాలో చెపుదూ!” అన్నాడు రామారావు మీసంమెలివేస్తూ. నిజానికి ఎలా రాబట్టుకోవాలో రామారావుకి తెలుసు మరి.

“వాచీ ఎలాగూ యిస్తారంటున్నావు. సైకిలుకావాలి. ఉంగరం యిస్తారా?” మళ్ళీ సందిగ్ధం కలిగింది తారకరావుకి.

“ఎందుకివ్వరూ? నువ్వుచెప్పూ, ఏమిటికావాలో!” అన్నాడు రామారావు గుండెనిబ్బరంతో. మావయ్య అంత నిబ్బరంగా చెప్తూంటే తనకేం అనుకున్నాడు తారకరావు.

“ఉంగరం మంచిపొడులున్నది...ఓ అలారంటైంపీసు ఓ పార్కరు సిల్వరు పెన్ను...” ఆగాడు తారకరావు. తనకే అగ్గువలా అనిపించా యివన్నీను.

“ఇంకాచెప్పరా... అనుమానమెందుకూ!” ప్రోత్సహించాడు రామారావు.

“ఇంకెందుకులే మావయ్యా! వాళ్ళయినా కొనివ్వాలా ...?” అన్నాడు తారకరావు.

"ఏడిశావులే...నీకెందుకా కనికరం. ఇలాగని కష్టం కూడా మానేయ్. ఎవడైనావింటే నవ్వుతాడు" అన్నాడు రామారావు, తారకరావుని రెచ్చగొడుతూ.

"పోలయితే, రేడియో ఒకాటి మావయ్యా" అన్నాడు తారకరావు అదే తన ఆఖరి కోరికలా.

"పోలవ్వకపోవడమేమిటి? అయ్యేట్టు చేస్తాను. మొదట ఆ వాచీ అమ్మే యేర్పాటుచెయ్యి. నష్టం లేకుండా చూడు."

"ఈవాళే అమ్మేసి రొక్కం తీసుకొస్తానుగా..... యిప్పుడే మళ్ళీవస్తాను మావయ్యా" అంటూ ఉత్సాహంగా వెళ్ళిపోయాడు తారకరావు. రామారావు తన తెలివికి తనే ఆశ్చర్యపోతూ నవ్వుకున్నాడు.

2

మేనల్లుడి పెళ్ళి ప్రయత్నాల్లో రామారావు మాంచి తెలివితేటలు కనబర్చా లనుకొన్నాడు. ఇంతాచూస్తే ఆ తెలివితేటలు మరొకర్ని దోపిడీ చేసేందుకే ఉపయోగపడుతున్నాయి. ఓ రోజు రామారావు వధువుతండ్రి విశ్వనాథం గారింటికి వెళ్ళాడు. విశ్వనాథం అతన్ని ఆప్యాయతతో ఆహ్వానించాడు.

"ఏమండీ! ఇలా దయచేశారు!" అన్నాడు విశ్వనాథం. రామారావు అలసిపోయినట్టుగా ఓ నిట్టూర్పు విడుస్తూ కుర్చీలో కూర్చున్నాడు.

"అన్నీ బాగానే వున్నయ్ కాని, మీ అల్లుడు మాత్రం పై మెట్టులో ఉన్నాడండీ విశ్వనాథంగారూ!"

"అంటే?" రామారావు వ్యంగ్యపదాలు మెవరి కర్థమవుతాయి గనక. విశ్వనాథంగారికికూడా అర్థంకాలేదు.

"మరేం లేదులెండి...యీకాలపు కుర్రాళ్లుకదూ! ఏమిటో అదికావాలి, ఇదికావాలి, అని కోరుతూంటారు. ఎవరో ఉన్నమహారాజులు యివ్వటంమూలాన, యీ లాంఛనాలు తప్పనిసరి అయిపోయా యిప్పుడు" డొంకతిరుగుడుగా తన అభిప్రాయం చెప్పాడు రామారావు. విశ్వనాథం అర్థం చేసుకోగలిగాడు. మహాకావాలంటే ఓసైకిలు కోరుకుంటాడు గామోసు...త నెలాగూ యివ్వాలనుకుంటున్నాడు.

"అవుతే అబ్బాయి ఏం కావాలంటున్నా డేవిటండీ?" అన్నాడు విశ్వనాథం నవ్వుతూ. రామారావు సందిగ్ధంలో పడ్డాడు—యేవిటి మొదట చెప్పాలా అని. కాస్సేపు వూరుకుని,

"సైకిలు కావాలటండీ..." అని యింక తక్కినవి కూడా ఓ వరుస చెప్పాలనుకున్నాడు. కాని విశ్వనాథం అడ్డొచ్చి—

"నే నా అభిప్రాయంతో నేవున్నానండి...నాకు మాత్రం తెలీదూ!" అన్నాడు తన అభిప్రాయం స్థిరమైనందుకు వుత్సాహితుడై.

"అదొక్కటే కాదులెండి" చెప్పక తప్పిందికాదు రామారావుకి. విశ్వనాథం గుండెలో రాయిపడింది. ఇంకేవిటున్నాయో కోరికలు!

"ఇంకేవిటండీ?" ఆశ్చర్యంగా అడిగాడు.

"చేతికి వాచీ లేదంట..." ఇంకా రామారావు చెప్ప బోతూంటే విశ్వనాథం గ్రహించి

ఆరోజు మేం మీయింటికి కొచ్చినప్పుడు అబ్బాయి చేతికి వాచీ వుండాలికదండీ?" అన్నాడు విశ్వనాథం. రామా రావు తికమకపడ్డాడు. తనకంటె ఘనుడులావున్నాడే యీ యన– అనుకున్నాడు మనసులో. అలాగని దొరికిపోతాడా?

"అది వాడిదనుకుంటున్నా రేవిటి! అలాంటిదికొనమని నన్ను విసిగించేస్తున్నాడు. నమూనా చూపించాలని తీసు కొచ్చాడు" అన్నాడు రామారావు నవ్వుతూ. తడుముకో కుండా, ధారాళంగా అబద్ధం చెప్పటం అతనికి మొదట్నుంచీ అలవాటే.

"సరే లేండి, మరేంచేస్తాం. అల్లుడు కావాలంటే ఆయన కోరినవన్నీ యివ్వాలి. అలాగని హిరణ్యాక్షవరాలడి గితే బ్రహ్మకే తరంకాదు. కాస్త మీరైనా ఆలోచించండి. యీ రోజుల్లో ధరలు ఎలా పెరిగిపోతున్నాయో! యింకేమైనా బాకీ వున్నాయా?" అనుమానంగానే వుంది విశ్వనాథంకి. రేడియో అడగటం పరిపాటు కదా! కొంపదీసి అదీ అడిగివుం టాడేమోనని భయం. అవుతేనేం, రామారావు చాలా చురు కుగా ప్రవర్తించాడు. ఇప్పటికే గుండెబాదుకుంటున్న విశ్వ నాథంను అప్పట్లో రేడియో అడగటం మంచిదికాదను కున్నాడు.

"ఇంకేవిటి లెండి–ఓ సీనియర్ పార్కరు పెన్ను...ఏం మహాభాగ్యం! ఓ అలారం టైంపీసు, అంతే. మరి వుంగరం

యెలాగూ మీ రిస్తారు. శాస్త్ర మంచిపోడులది చూసి తీసుకోండి" అనేశాడు గుక్కతిప్పకుండా. చెప్పుకోవాలంటే విశ్వనాథంకి రామారావుమీద తగనికోపంవచ్చింది చప్పున అతణ్ణీక నులిమేయాలన్నంత వుద్రేకం వుప్పొంగింది. కాని యిన్నాళ్ళకి కుదిరిన సంబంధం చేతులారా విడిచిపెట్టుకోవటమే!

"అంత సులువుగా చెప్పేశారుగాని రామారావుగారూ, యివన్నీ కలిపితే యెంత మొత్త మవుతుందో, ఆలోచించారూ? మళ్ళీ కట్నంలో ఓకానీ తగ్గిస్తే ఒప్పుకోరు. ఎంత వరుల గిరాకి రోజులయినా, యింత దురాశ వుండకూడదనుకుంటాను. మాట కనుకుందాం... మీకూ ఓ కూతురుంటే యివన్నీ యిచ్చేవారేనా?" అన్నాడు విశ్వనాథం కోపాన్ని నిగ్రహించుకోలేక. రామారావు స్తబ్ధుడై పోయాడు. ఇల్లాంటి ఎదురు ప్రశ్న విశ్వనాథం నోటినుండి వస్తుందనుకోలే దతను.

"తప్పనిసరవుతే మరి, యిచ్చుకోక యేం చేస్తాం చెప్పండి...యిచ్చుకోవాలి. నే నవుతేమాత్రం యెక్కువా?" అన్నాడు రామారావు. తనకి కూతుళ్ళు లేరు కాబట్టి నిశ్చింతగా అనేశాడు. లేకపోతే తనిచ్చుకునేవాడేగా! విశ్వనాథం మరేం వాదించలేదు.

"సరే లేండి... మరేంచేస్తాం, వరుని తరఫువాళ్ళదే గెలుపు" అన్నాడు. రామారావు ఆశయం నెఱవేరింది. ఎంతో ఆనందించాడు. ఇంక అక్కడెందుకుండాలి!

"వస్తానండి మరి..." అంటూ వెళ్ళిపోయాడు రామారావు. విశ్వనాథంకి వళ్ళుమండిపోయింది. రామా

రాకే యిదంతా జరిగిస్తున్నాడన్న అభిప్రాయాని కొచ్చేశాడు. అందుకే రామారావు వెళ్ళిపోతున్నప్పుడు కనీసం కాఫీ త్రాగి వెళ్ళమనైనా అనలేదు.

రామారావు పరిపూర్ణంగా విజయం పొందలేక పోయినా, ఓడిపోలేదు. అనుకున్న వాటిలో మూడువంతులు ఫలించింది. కార్యశూరత గలవాడనే చెప్పుకోవాలి. మరి ఆ ఒక్క రేడియో రప్పించుకుంటేనేగాని, తనకి పూర్తిగా విజయం కాదు. ఆ రేడియో రప్పించుకోవటం యెట్లా? తీవ్రంగా ఆలోచించాడు. చటుక్కున వుపాయం తట్టింది. తనలోతనే నవ్వుకుని యింటికి సాగిపోయాడు.

3

విశ్వనాథంగారింట్లో పెళ్ళిప్రయత్నాలు మహా అలజడిగా జరుగుతున్నయ్! వస్తున్న బంధువులు ఆరోజు వరకూ వస్తూనే వున్నారు. సరిగ్గా పెళ్ళినాటికే శ్రీనివాసం కూడా వూడిపడ్డాడు. శ్రీనివాసం విశ్వనాథంకి బీరపీచులాంటి చుట్టం. అంత సన్నిహితుడైనందుకు శాస్త్ర ముందు రావల్సిందే కాని వీల్లేకపోయింది. మనిషి చూడ్డానికి గంభీరంగా అగుపిస్తాడు కాని, పెద్దమనిషితరహా ఆతనిలో మూర్తీభవించి వుందేమోననిపిస్తుంది.

"సరిగ్గా వేళకి రాకపోతే, ఒకరోజు ముందువస్తే యేం పోయిందోయ్" అన్నాడు విశ్వనాథం శ్రీనివాసాన్నుద్దేశిస్తూ.

"తీరిక వుంటే రానూ...తీరికలేకే రాలేదోయ్... ఎంత వీలుచూసుకుందామన్నా, యేదో ఒక అంతరాయం

కలుగుతూనే వుండేది" అన్నాడు శ్రీనివాసం. విశ్వనాథం యింకేమనగలడు? కాస్సేపు యిద్దరూ మౌనంగా వూరుకున్నారు.

"ఆ! అన్నట్లు యెవరా వరుడు?" అడిగాడు శ్రీనివాసం.

"ఎవరని చెప్పను... వాళ్ళు వాళ్ళెవ్వరూ నీకు తెలీదు. ఆ అబ్బాయికి తండ్రి లేడులే. మేనమామ యింట్లో వుంటున్నాడు."

"అవుతే కట్నం యేపాటి?"

"మామూలేగా - వేయిన్నూటపదహార్లు."

"ఊ! యింకేం యితర లాంఛనాలున్నాయా?"

"లేకేం. కావల్సినవన్నీ జాబితాలా చెప్పారు."

"ఏమిటీ?" ఆసక్తిగా అడిగాడు శ్రీనివాసం. యిలాంటివి వింటమంటే అతనికి సరదా.

"ఓ వాచీ, ఓ సైకిలు, సీనియర్ పార్కరు, అలారం టైమ్‌పీసు, ఇంకా వుంగరం..." అంటూ ఆపేయబోతున్నాడు విశ్వనాథం. శ్రీనివాసం ఆశ్చర్యపోతూ అడ్డొచ్చి-

"ఇంకేమైనా వున్నాయా?"

"లేవోయ్."

"ఏమిటీ హిరణ్యాక్షువరాలు? అన్నీ యిప్పుడే రాబట్టుకోవా లనుకుంటున్నారా? నువ్వు ఒప్పుకున్నా వేమిటోయ్" అన్నాడు శ్రీనివాసం కాస్త కోపంగా. అతని కిల్లాంటి నిర్బంధ లాంఛనాలంటేనే వళ్ళుమంట.

"ఒప్పుకోక, మారేం చేస్తాం చెప్పూ...? యింక యేన్నా

ళ్ళని అమ్మాయి నింట్లో వుంచుకుంటాం ?"

"బావుంది వరస...ఆశకి అంతం అంటూ వుండాలా మరి...ఆ అబ్బాయికి అవసరమైనవన్నీ యిప్పుడే సమకూర్చు కుంటున్నారన్న మాట....ఇంకో హాటి మర్చిపోయారు.

"ఏమిటి శ్రీనివాసం?"

"రేడియో - అదీ అడిగేస్తే పూర్తవుతుం దా వరాల జాబితా" అన్నాడు వ్యంగ్యంగా శ్రీనివాసం. విశ్వనాథంకి నవ్వాగింది కాదు.

"నేనూ, అదే అనుకొన్నానోయ్...వాళ్ళ ధర్మ మంటూ రేడియో అడగలేదు" అన్నాడు విశ్వనాథం నవ్వుతూ

"ఇప్పుడడగలేదని కులుకుతున్నావుగాని, మరోసా రెప్పుడో గుంజుతారులే. నీలాంటి ఇచ్చే మహానుభావులుంటే తీసుకునేవాళ్ళకి కొదవేమిటి" అన్నాడు శ్రీనివాసం నవ్వుతూ.

"అలాగనే అంటావుగాని పరిస్థితి ఆలోచించావు కాదు. ...సరేలే, అవన్నీ తరవాత మాట్లాడదాం. లేచి స్నానం చేయవోయ్. వడ్డనలకి తయారవ్వాలి" అంటూ విశ్వనాథం బయటికి పోయాడు. శ్రీనివాసం పంటకొంచియింట్లోకి వెళ్ళాడు.

పెండ్లికొడుకు వూరేగింపుతో తరలి వధువు యింటికి వచ్చాడు. తారకరావు [పెండ్లికొడుకు] పందిట్లో ఓ చివర కుర్చీలో కూర్చున్నాడు. రామారావు తన తెలివితేటలన్నీ యిప్పుడు చూపించాలనుకున్నాడు. ఎలాగైనా రేడియో కూడా రాబట్టుకోవాలని అతని సంకల్పం.

"ఒరేయ్ తారకం, యిప్పుడు మంచి నాటకమాడా లిరా" అన్నాడు మెల్లిగా యెవ్వరూ వినకుండాను. తారక రావుకి భయంవేసింది, యింకా నాటకమంటూ డేవిటూ, అని,

"ఏవిటి మావయ్యా?"

"నిన్ను పౌరోహితుడుగాని, యింకెవరుగాని పెండ్లి పీటలమీదికి రమ్మంటారనుకో...వెళ్ళకు...అంతే, తక్కిందినేను చూసుకుంటాను" అన్నాడు రామారావు. మేనమామ మాటలకి చకితుడయ్యాడు తారకరావు. కాదూ మరి! అన్నీ నిశ్చయమయ్యాంతరవాత 'పెండ్లిపీటలమీదికి వెళ్ళను' అంటే యేమన్నా అర్థంవుంది?

"ఏం మావయ్యా?"

"రేడియో యెలా వస్తుందిరా మరి...నీ కెందుకు— నువ్వు నిశ్చింతగా కూర్చో, నేను చూసుకుంటాను" అన్నాడు రామారావు.

"ఏవిటో మావయ్యా, నాకు భయంగావుంది." అన్నాడు తారకరావు. నిజమే! భయంకాదూ! బొమ్మల పెళ్ళిళ్లాయేం? నలుగురిలో నగుబాటవుతుం దేమోనని అతని భయం. కాని మావయ్య తెలివితేటలు సహకారిగా వుండొచ్చనుకున్నాడు. మేనల్లుడి మాటలకి రామారావు నవ్వేసి "నీ కన్నీ భయమేలేరా" అంటూ హడావిడిగా వెళ్ళిపోయాడు.

పౌరోహితుడు వరుణ్ణి పీటలమీదికి రమ్మన్నాడు. ఎవరూ అక్కడ లేకుండానే యేవేవో మంత్రాలు చదివేస్తున్నాడాయన. ఎవరికి తెలుసుగనక యేంచదువుతున్నాడో!

అదేసమయమనుకుని రామారావు ఓసారి తారకరావు దగ్గరికి వెళ్ళి యేమీ అడక్కుండానే యేదో గొణుక్కుంటూ విశ్వనాథం దగ్గరికి వచ్చాడు.

"ఈకాలపు కుర్రాళ్ళతో యిదే చిక్కండీ... పెద్దల మాటలు కాస్తయినా చెవినిపడనియ్యరు" అన్నాడు గాబరాగా, తనెంతో ఆందోళన పడుతున్నట్టుగా.

"ఏమయిందండీ?" అన్నాడు విశ్వనాథం బెదిరిపోతూ.

"అటు తరుణం మించిపోతోంది. వెధవని పెండ్లీ పీట మీదికి వెళ్ళమంటే ససేమిరా వెళ్ళనంటున్నాడు. ఎంతని బోధ పర్చేది!" అన్నాడు రామారావు. విశ్వనాథం స్థంభించి పోయాడు. మాట్లాడలేకపోయాడు. వళ్ళంతా చెమటపోసింది.

"ఎందుకు వెళ్ళనంటున్నాడండీ?" ఆత్రంగా అడిగాడు. ఆత్రతకాదూ మరి...యిన్ని యేర్పాట్లు చేసుకున్నాక ఆటంకమా ?

"ఏవిటో! ఈకాలపు కుర్రాళ్లు కదండీ, పెడసరం హెచ్చు...కోరికలు అంతకు మించివుంటయ్..మొన్న అవస్లే కావాలన్నాడా, యిప్పుడు రేడియో యిచ్చేవరకు కదల్నంటాడు"అన్నాడు రామారావు. అక్కడికి తనకేం తెలీనట్టుగా. విశ్వనాథం వుద్రిక్తుడైపోయాడు. తన మంచితనంచూసి యిలా ఆడించుతున్నారేమో ననుకొన్నాడు.

"ఏవిటండీ, రామారావుగారూ! మీరైనా ఆలోచించారా! ఆ అబ్బాయికి ఆపాటి వూహించేజ్ఞానం లేకపోతే మీకైనా వుండొద్దూ! మొదట్లో మీరిచ్చిన జాబితాలో రేడియో మాటేలేదే. అప్పుడే అడిగివుంటే నేనీసంబంధమే

చెప్పకొనేవాణ్ణికాదు. రేడియో అంటే కాసీయా, పరకా! అయినవందలు పెట్టండే రాదు. ఇవ్వడంటే యేలాంభం! నేను కొనివ్వలేను సుమండీ... అన్నాడు ఆవేశంగా. ఆ ఆవేశంలో రామారావు బుద్ధిహీనతకూడా కనబర్చాడు

"అలాగంటె యెట్లాగండీ! నా డొక్కేకాలుపై కూర్చున్నాడు. లేకపోతే లేచిపోతానంటున్నాడు" అన్నాడు రామారావు, విశ్వనాథాన్ని భయపెట్టాలని. విశ్వనాథం నిజంగా భయపడ్డాడు. అది అతని కో పరీక్షాసమయం. రామారావన్నట్టు వరుడు తిరిగిపోతేనో! ఇక తన కూతురికి వివాహం జరగటం కల్లోమాట...అనుకొన్నాడు విశ్వనాథం. అవుతే యిప్పుడేంచేస్తాడు? తీవ్రమైన ఆలోచనలోపడ్డాడు. అదృష్టవశాత్తూ శ్రీనివాసం అక్కడికి వచ్చాడు. విశ్వనాథంకి కాస్త ధైర్యం కలిగింది.

"ఏమిటోయ్ విశ్వనాథం ఆలోచన? అటు ముహూర్తం మించిపోతుంది వరుడు రావాలిట" అన్నాడు శ్రీనివాసం. అతని గంభీరమైన ఆకారంచూసి యెందుకో రామారావు కాస్త భయపడ్డాడు.

"రేడియో కొనిచ్చేవరకూ వరుడు పెండ్లిపీటమీదికి రాడుటోయ్" అన్నాడు విశ్వనాథం. శ్రీనివాసం యెదురుగా వున్న రామారావువేపు గుడ్లురుముతూ చూశాడు.

"మీరేనాండి, అబ్బాయి మేనమామగారు!...నామమాత్రానికి అతన్నివుంచి మీరే యీనాటకాన్నంతా ఆడుతున్నట్టుందే! ఇప్పటికడిగినవి తక్కువైపోయాయనా మిగిలింది చెప్పేశారు! ఏదీ, నేనే ఆ అబ్బాయి నడుగుతా"నంటూ చర

చరా పెండ్లి కొడుకు దగ్గరికి పోయాడు. అంతవరకూ ధైర్యంగా నాటకమాడుతున్న రామారావు వణికిపోయాడు. అంతమంది సమక్షంలో నగుబాటు రావలసివస్తుందేమోనని భయపడ్డాడు కూడా. శ్రీనివాసం ఒకపాళాన వదలడేమో ననుకున్నాడు.

శ్రీనివాసం పెద్దఅంగలు వేసుకొని తారకరావు దగ్గరికి పోయాడు. తారకరావుకి తలపై పెద్దపిడుగు పడ్డట్టయింది. శ్రీనివాసాన్ని ఎదిరించి చూడలేకపోయాడు.

‘ఏమోయ్, రేడియో యివ్వందే పీటమీందికి రానన్నావుటగా. యింకేవిటి మిగిలాయో చెప్పు!” అన్నాడు గంభీరంగా. మొదటే భయపడుతున్న తారకరావుకి అతనికంఠం విని మరీ వణుకుపుట్టింది.

అప్పటికే యెంతోమంది చుట్టూ మూగారు. తారకరావు బట్టలు చెమటతో తడిసిపోయాయ్. నోటమాటరా లేదు. మామయ్య వేపు చూశాడు. రామారావు గుటకలు మింగుకుంటూ యేదో చెప్పాలని ముందుకొచ్చాడు.

“మీరూరుకోండి...చెప్పేదేదో ఆయన్నే చెప్పనీండి— ఏమయ్యా చెప్పవేం! బొమ్మలపెళ్ళి అనుకొంటున్నారా, మీయిష్టమొచ్చినట్లు ప్రవర్తించటానికి... నడువు పిచ్చివేషాలు వేయక” అని గర్జించాడు శ్రీనివాసం. అప్పటికే నలుగుర్లో అవమానం పొందినట్టుగా ఫీలయ్యాడు తారకరావు. మారు మాటాడకుండా, మామ ముఖమైనా చూడకుండా నడిచాడు. అందరూ గుసగుసలాడుకొంటున్నారు. రామారావు చిన్నబుచ్చుకున్నాడు. అతని తెలివితేటలు శ్రీనివాసందగ్గర పనికిరాలేదు. అతన్ని యెదిరించే ధైర్యం లేకపోయింది.

శ్రీనివాసంకి రామారావు వాదకోపం కట్ట తెగి ప్రవహించింది. ప్రతీకారం చెయ్యాలనుకున్నాడు. వెధవ! యెంతదురాశ వీడికి? యెన్ని డిమాండులు! ఒకటా రెండా.. తగినశాస్తి చెయ్యాలనుకున్నాడు శ్రీనివాసం. అగ్నిసాక్షిగా వివాహం జరిగిపోయింది.

శ్రీనివాసం ప్రోద్బలంవల్ల వరుడికి ఒక్క సైకిలే యివ్వబడింది. విశ్వనాథం మొదట్లో కాస్త జంకినా, శ్రీనివాసంఆసరా చూసుకొని ధైర్యం తెచ్చుకున్నాడు. రామారావు కాలు కాలిన పిల్లిలా లేచాడు... రేడియో లేకపోతేపోయె తక్కినవైనా యిమ్మన్నాడు.

"ఇదేం ధర్మసత్రవు కాదండీ, మీరడిగినవన్నీ మేం యివ్వడానికి! మీరడగటానికి హద్దూ, పద్దూ వుండాలి... మీహిరణ్యాక్షవరాలు ప్రసాదించడానికి బ్రహ్మదేవుడే దిగి రావాలి" అన్నాడు శ్రీనివాసం అంతమందిలోనూ. ఏం చేయాలో రామారావుకి తోచలేదు మేనల్లుణ్ణి తీసికొని తిరిగి పోదామంటే వివాహం జరిగిపోయింది. అంతమందిలోనూ శ్రీనివాసంతో వాదిస్తే తనకే వోటమివస్తుందని తెలిసి యేం చేయలేక వూరుకున్నాడు రామారావు అతితెలివితేటలు చూపించి మేనల్లుడి మెప్పుపొందాలనుకున్నాడు. కాని దాని పర్యవసానం యిలా యేడ్చింది.

చివరికి వరుడికి లభించిం దొక్క సైకిలే; వున్న మంచి వాచీకూడా అమ్ముకున్నందుకు విచారించాడు తారకరావు. మరోమాటకి కొనుక్కుందాంలే అని ధైర్యం చెప్పాడు రామారావు. ఇలాంటి దురాశాపరులు యిప్పటికీ మన సంఘంలో వున్నారంటే అతిశయోక్తి వుండదు. ఏమంటారు?